# బిజెపి మండల అధ్యక్షుడు ఆత్మహత్య





✦ సూసైడ్ నోట్‌లో కాంగ్రెస్ నాయకుల పేరు ప్రస్తావన

✦ మృతికి కారకులైన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బిజెపి నాయకులు ధర్నా

వేమనపల్లి, అక్టోబర్ 10, ప్రభాతవార్త

కాంగ్రెస్ నాయకుల వేధింపులు తాళలేక వేమనపల్లి బిజెపి మండల అధ్యక్షుడు ఏట మధుకర్ (45) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన నీల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం నీల్వాయి అటవీ ప్రాంతంలో చోటు చేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. దసరా రోజున జరిగిన గొడవలో చింతకింది కమల అనే మహిళ తనతో అసభ్యకరంగా ప్రవర్తించాడని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో మధుకర్‌పై ఎస్సీ, ఎస్టీ



అట్రాసిటీ కేసు నమోదు చేశారు. దాంతో మనస్థాపానికి గురైన మధుకర్ నీల్వాయి అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. 2లో..

ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శనివారం 11, అక్టోబర్ 2025



# విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన అందించాలి

✳ ఆసిఫాబాద్ జిల్లా అదనపు కలెక్టర్, ఇన్‌ఛార్జీ జిల్లా విద్యాధికారి దీపక్ తివారి



ఆసిఫాబాద్, అక్టోబర్ 10, ప్రభాతవార్త

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించాలని ఆసిఫాబాద్ జిల్లా అదనపు కలెక్టర్, ఇన్చార్జి జిల్లా విద్యాధికారి దీపక్ తివారి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు రమాదేవితో కలిసి అన్ని ప్రభుత్వ యాజమాన్యాల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులతో 10వ తరగతిపై కార్యచరణ, నాణ్యమైన విద్యాబోధన, పాఠశాలలలో మౌలిక వసతుల కల్పన అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్, ఇన్చార్జి జిల్లా విద్యాధికారి మాట్లాడుతూ ఉపాధ్యాయులు విధుల పట్ల సమయపాలన పాటిస్తూ విద్యార్థుల హాజరు శాతాన్ని మెరుగుపరిచేలా కృషి చేయాలని తెలిపారు. ప్రతి పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్, ఎఐ, ఎఐఎక్స్ కార్యక్రమాలు నిర్వహించాలని, విద్యా ప్రమాణాలను పాటిస్తూ నాణ్యమైన విద్యను అందించాలని తెలిపారు. యు డైస్ పోర్టల్ లో పాఠశాలలకు, విద్యార్థులకు సంబంధించిన ప్రతి అంశాన్ని నమోదు చేయాలని తెలిపారు. తరగతి గదిలో సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని, పాఠశాలకు గైర్హాజరైన విద్యార్థులను గుర్తించి క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చే విధంగా ఆయా విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. 10వ తరగతి వార్షిక పరీక్షల వైపు విద్యార్థులను ఇప్పటి నుంచి సన్నద్ధం చేయాలని, ఇంగ్లీష్, సైన్స్, మ్యాథ్స్ సబ్జెక్టులపై మిగతా 2లో..

# శిథిలావస్థలో అంగన్‌వాడీ కేంద్రం

● సందర్శించిన ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్

చింతలమానేపల్లి, అక్టోబర్ 10, ప్రభాతవార్త

మండలంలోని డబ్బా గ్రామ పంచాయతీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) జనరల్ సెక్రటరీ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ సందర్శించారు. ఈ కేంద్రం శిథిలావస్థలో ఉండటంతో పాటు కనీస సౌకర్యాలు లేకపోవడం గమనించారు. 10న20 అడుగుల ఒకే గదిలో వంటగది, స్టోర్ రూమ్, మరియు 30 మంది పిల్లలు ఉండే దుస్థితి నెలకొని ఉంది. విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో పాటు, కేంద్రం బయట ఉన్న పెద్ద నీటి గుంట వల్ల పిల్లలు ఆడుకునే సమయంలో ప్రమాదం పొంచి ఉంది. ఈ సమస్యలను దృష్టిలో ఉంచుకొని, డాక్టర్ ప్రవీణ్ కుమార్ అధికారులు వెంటనే కొత్త భవనం నిర్మించాలని, పిల్లలకు భద్రతా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టకపోతే, స్థానిక బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులతో కలిసి శ్రమదానం ద్వారా మరమ్మతులు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొంగ సత్యనారాయణ, ఏంఏ సలీం, రామటెంకి నవీన్, జుమడి సాగర్, బండ శేఖర్ యాదవ్, రామటెంకి దినేష్, మున్నా ఖాన్, తాండ్ర నవీన్, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బాణాసంచా దుకాణాల ఏర్పాటుకు

# అనుమతులు పొందాలి

✳ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్

ఆసిఫాబాద్, అక్టోబర్ 10,ప్రభాతవార్త

దీపావళి పండుగను పురస్కరించుకొని సరైన అనుమతులు పొంది తాత్కాలిక బాణాసంచా విక్రయ దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే శుక్రవారం తెలిపారు. జిల్లాలోని మండలాలు, గ్రామాలలో సంబంధిత శాఖల అనుమతి లేకుండా ఎవరు బాణసంచాను విక్రయించకూడదని, బాణసంచా అమ్మకాల కోసం తాత్కాలిక దుకాణాలను ఏర్పాటు చేయడానికి అనుమతి కోసం సంబంధిత ప్రతిపాదనలను కాగజనగర్ సబ్ కలెక్టర్, ఆసిఫాబాద్ రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ ద్వారా దీపావళి పండుగకు కనీసం ఒక వారం ముందుగా పంపించాలని తెలిపారు. సరైన అనుమతి లేకుండా బాణసంచాను విక్రయించినట్లయితే తీవ్రంగా పరిగణిస్తామని తెలిపారు. ఈ విషయంలో ఆయా మండలాల తహసీల్దారులు బాధ్యత వహించాలని తెలిపారు.

# సమాచార హక్కు చట్టాన్ని నిబంధనల ప్రకారం నిర్వహించాలి

✳ మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య

నస్పూర్, అక్టోబర్ 10, ప్రభాతవార్త



సమాచార హక్కు చట్టంలో అందిన దరఖాస్తులకు సంబంధించిన సమాచారాన్ని నిబంధనల ప్రకారం అర్జిదారులకు అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య అన్నారు. సమాచార హక్కు చట్టం వారోత్సవాలలో భాగంగా శుక్రవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, అప్పిలేట్ అధికారులు, ప్రజా సమాచార, సహాయ ప్రజా సమాచార అధికారులతో సమాచార హక్కు చట్టం 2005పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టంలో పారదర్శకత, జవాబుదారీతనం ఆవశ్యకమని, సమాచార హక్కు చట్టం నిర్వహణలో పారదర్శకత ప్రామాణికమని, మిగతా 2లో..

# బిజెపి మండల అధ్యక్షుడు ఆత్మహత్య

సమాచారం అందుకున్న చెన్నూరు రూరల్ సీఐ బన్సిలాల్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని మృతుడి వివరాలు సేకరించారు. రమృతుడి ప్యాకెట్‌లో లభ్యమైన మరణ వాంగ్మూలం కన్నీరు పెట్టిస్తుంది. అందులో తన మరణానికి కారణం మాజీ జెడ్పిటిసి ఆర్.సంతోష్ కుమార్, మాజీ సర్పంచ్ గాలి మధు, చింతకింది కమలలే కారణమని రాశాడు. తనను రాజకీయంగా ఎదురు కోలేక తప్పుడు కేసులు పెట్టించి, నా యొక్క పరువు ప్రతిష్టను దెబ్బతీశారని, నా చావుకు కారణమయ్యారని రాశాడు. నేను ఎలాంటి తప్పు చేయలేదని, నాది అలాంటి స్వభావం కాదని నా చావుకు కారణం అయిన వారిపైన చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, మన మండలంలో కుల రాజకీయాలు నడుస్తున్నాయని, అప్పుడు దుర్గం శివరాం ఇప్పుడు నేను ఇలా బలికావాల్సిందేనా మండల ప్రజలారా ఆలోచించండి, అగ్రవర్ణాల పాలకులకు బుద్ధి చెప్పండి అని మరణ వాంగ్మూలంలో రాశాడు. రాజకీయ కక్షలతో ఒక నిండు ప్రాణం పోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. సంఘటన స్థలానికి పెద్ద ఎత్తున చేరుకున్న బిజెపి, బిఆర్ఎస్ నాయకులు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేయడంతో రవాణా వ్యవస్థ స్తంభించింది. సీఐ బాన్సిలాల్ నచ్చ చెప్పడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఆత్మహత్యకు కారణమైన వారిపై కేసు నమోదు చేసేవరకు శవాన్ని కదలనివ్వమని కుటుంబ సభ్యులు తెలపడంతో సాయంత్రం వరకైనా సమస్య కొలిక్కిరాలేదు. మృతునికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

### లా అండ్ ఆర్డర్ సమస్య తలెత్తకుండా పోలీసుల భారీ బందోబస్తు..

లా అండ్ ఆర్డర్ సమస్య తలెత్తకుండా పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. ముగ్గురు సీఐలు, ఐదుగురు ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### బాధ్యులపై చర్యలు తీసుకోవాలి..

బిజెపి పార్టీ ఆధ్వర్యంలో బిజెపి జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యాల హేమాజీ ఉదయమే సంఘటన స్థలానికి చేరుకుని ఏట మధుకర్ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు, నీల్వాయి ఎస్సై కోటేశ్వర్ వేధింపులు అక్రమ కేసులు ఏట మధుకర్‌ను తీవ్ర మనస్థాపానికి గురి చేశాయని, పార్టీ కోసం నిరంతరం పోరాడిన మధుకర్ ప్రాణాలు రాజకీయ కక్షలకు బలయ్యాయని, కాంగ్రెస్ నాయకుల దౌర్జన్యాన్ని ప్రజలు ఖండించాలని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని బిజెపి పార్టీ తరుపున డిమాండ్ చేశారు. ఏట మధుకర్ కుటుంబానికి బిజెపి పార్టీ అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన అందించాలి

*(మొదటిపేజీ తరువాయి)*

ఉపాధ్యాయులు ప్రత్యేకంగా బోధించాలని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, విద్యార్థులకు మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన ఆహారాన్ని పంపించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ సమన్వయకర్తలు ఉదయ్ బాబు, ఉద్ధవ్, హనుమంతు, దేవాజీ, మధుకర్, శ్రీనివాస్, అబిద్ అలీ, మండల విద్యాధికారులు, ఆశ్రమ పాఠశాలలు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల ప్రధానోపాధ్యాయులు, తెలంగాణ ఆదర్శ పాఠశాలల ప్రిన్సిపాల్‌లు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టాన్ని నిబంధనల ప్రకారం నిర్వహించాలి

*(మొదటిపేజీ తరువాయి)*

అభ్యర్థులు దరఖాస్తు ద్వారా కోరిన సమాచారాన్ని చట్టం నిబంధనలకు లోబడి అందించాలని, అధికారులు జవాబుదారీతనంతో వ్యవహరించాలని తెలిపారు. ఈ చట్టం అమలు ద్వారా పని సామర్థ్యం పెరుగుతుందని, దరఖాస్తుదారుడు కోరిన సమాచారాన్ని నిబంధనలకు లోబడి నిర్ణీత గడువులోగా తప్పనిసరిగా అందించాలని తెలిపారు. అధికారులు సమాచార చట్టాన్ని ప్రజలలోకి తీసుకువెళ్లాలని, ప్రజా సంఘాల సభ్యులు, అధికారులు సమన్వయంతో వ్యవహరించి చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. అర్జీదారులు కోరిన సమాచారాన్ని అందించడం ద్వారా ప్రజలను ప్రభుత్వ కార్యక్రమాలలో భాగస్వామ్యం చేయడం జరుగుతుందని తెలిపారు. సమాజంలో ప్రతి అంశంపై అవగాహన కలిగిన పౌరులు సమాజాభివృద్ధికి పునాది లాంటి వారని తెలిపారు. సమాచార హక్కు చట్టం ప్రతి భారత పౌరులకు వర్తిస్తుందని, ఈ చట్టాన్ని వినియోగించుకుని సమాచారం తెలుసుకోవడం ద్వారా మాట్లాడడం, ప్రభుత్వ సంక్షేమ ఫలాలను పొందడం జరుగుతుందని తెలిపారు. సమాజంలో జరిగే ప్రతి విషయంపై అవగాహన కల్పించి పూర్తి సమాచారం తెలియజేయడం ద్వారా పారదర్శకమైన ప్రభుత్వ పాలన ప్రజలకు అందుతుందని తెలిపారు. సమాచార హక్కు చట్టాన్ని గౌరవించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## బెల్లంపల్లి ఏరియాలో జిఎం సిహెచ్‌పి పర్యటన

బెల్లంపల్లి, అక్టోబర్ 10, ప్రభాతవార్త

బెల్లంపల్లి ఏరియాలో జిఎం (సిహెచ్‌పి) కార్పోరేట్ రామ్మూర్తి శుక్రవారం రోజున పర్యటించారు. గోలేటి సిహెచ్‌పిని పరిశీలించి అధికారులకు రవాణా, నాణ్యత విషయంలో సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం జనరల్ మేనేజర్ కార్యాలయంలో ఏరియా అన్ని విభాగాల అధిపతులతో సమావేశం నిర్వహించారు. ఏరియా ఉత్పత్తి, ఉత్పాదకతను తెలుసుకున్నారు. గోలేటి జనరల్ మేనేజర్ ఎం. విజయ భాస్కర్ రెడ్డి బెల్లంపల్లి ఏరియా అధికారులతో కలిసి సన్మానించారు. పూల మొక్కలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జిఎం కె. రాజమల్లు, ఏరియా ఇంజినీర్ కృష్ణ మూర్తి, డీజీఎం (ఐఈడి) ఉజ్వల్ కుమార్ బెహరా, ప్రాజెక్ట్ ఇంజినీర్ వీరన్న అన్ని విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత రైతులకు నష్టపరిహారం చెల్లింపు

సిరికొండ, అక్టోబర్ 10, ప్రభాతవార్త



సిరికొండ మండలంలోని రిమ్మ గ్రామానికి చెందిన మడావి సీతారాం, పెందూర్, జంగు, పెందూర్ షంబులకు చెందిన ఎద్దులు గత సంవత్సరం ఏప్రిల్ మాసంలో 11 కెవి విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయని రైతులు తెలిపారు. కాగా నష్టపరిహారం కింద బాధిత రైతులకు శుక్రవారం రోజు విద్యుత్ శాఖ సబ్ డివిజన్ కార్యాలయంలో ముగ్గురు రైతులకు కలిపి మొత్తం 1,20,000 రూపాయలను బాధిత రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారి, రిమ్మ మాజీ సర్పంచ్ పెందూర్ అనిల్ కుమార్, బాధిత రైతులు ఉన్నార్బు



## మహిళల భద్రత కోసం చేపడుతున్న చర్యలపై అవగాహన

ఆసిఫాబాద్, అక్టోబర్ 10, ప్రభాతవార్త

మహిళల భద్రత కోసం చేపడుతున్న చర్యలపై షీ టీం సభ్యులు విద్యార్థులకు వివరించారు. శుక్రవారం ఆసిఫాబాద్ మండలంలోని చిర్రకుంట, తూంపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో షీ టీం సభ్యులు విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా షీ టీం సభ్యులు విద్యార్థినులకు వారి పనితీరు, లక్ష్యాలు, మహిళల భద్రత కోసం చేపడుతున్న చర్యల గురించి విపులంగా వివరించారు. విద్యార్థినులు ఏవైనా వేధింపులు, సమస్యలు ఎదుర్కొంటే షీ టీం హెల్ప్‌లైన్ 8712670564, డయల్ 100, స్థానిక పోలీసు స్టేషన్ ద్వారా సమాచారం ఇవ్వాలని సూచించారు. అదేవిధంగా డ్రగ్స్, ఎన్డిపిఎస్ యాక్ట్, సైబర్ క్రైమ్ పైన అవగాహన కల్పించారు. మహిళలు తమ హక్కులను తెలుసుకుని, భద్రత కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో షీ టీం సభ్యులు స్వప్న, రజని, దినేష్, ప్రిన్సిపాల్ నరహరి, విద్యార్థులు పాల్గొన్నారు.

## విదేశీ ఉద్యోగ అవకాశాలకు దరఖాస్తుల స్వీకరణ

### - మంచిర్యాల జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ

నస్పూర్, అక్టోబర్ 10, ప్రభాతవార్త

తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్ కామ్) ఆధ్వర్యంలో కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీల శాఖకు చెందిన నమోదిత నియామక సంస్థ, రాష్ట్రానికి చెందిన అర్హత, నైపుణ్యం/అర్థ నైపుణ్యం గల కార్మికులకు విదేశీ ఉద్యోగ అవకాశాలను కల్పించడం జరుగుతుందని జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. టామ్ కామ్ గ్రీస్‌లో హాస్పిటాలిటీ, నిర్వహణ, సేవా రంగాలలో వివిధ పాత్రలలో 1 వేయి విదేశీ ఉద్యోగ అవకాశాలను పొందిందని, హోటల్ మేనేజ్మెంట్ లో డిప్లమా/డిగ్రీ అర్హత కలిగిన వారు, ప్రభుత్వ అనుమతితో నైపుణ్య ధ్రువీకరణ పొందిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఉచిత వసతి, భోజనం, బీమా అందించడం జరుగుతుందని, చివరి నెల జీతంతో విమానం టికెట్ ఖర్చులు తిరిగి చెల్లించబడతాయని, 8 గంటల పని+ 45 నిమిషాల విరామం, అదనపు పనిగంటలకు అదనపు వేతనం ఉంటాయని, ఆంగ్ల భాషలో నైపుణ్యం కలిగి ఉండాలని, వీసా, ఖర్చులు అభ్యర్థి వహించాలని తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు తమ నవీకరించబడిన రెజ్యూమ్ tomcom.resume gmail.com కు ఈ మెయిల్ చేయాలని, ఇతర వివరాలకు 9440052081, 9440051452 నంబర్లు, వెబ్ సైట్ www.tomcom.telangana.gov.in లో సంప్రదించవచ్చుని తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## అలరించిన సైన్స్ డ్రామా పోటీలు

ఆసిఫాబాద్, అక్టోబర్ 10, ప్రభాతవార్త

జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో శుక్రవారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ డ్రామా పోటీలు అలరించాయి. మానవ జాతి ప్రయోజనం కోసం శాస్త్ర సాంకేతికత అనే అంశంపై వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు అద్భుత ప్రదర్శనతో న్యాయనిర్ణేతలను మెప్పించారు. జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రదర్శన అత్యుత్తమ ప్రదర్శన చేసి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. ఆసిఫాబాద్ తెలంగాణ ఆదర్శ పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. వీరికి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా సైన్స్ అధికారి మధుకర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు శాస్త్ర సాంకేతి రంగాలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరముందన్నారు. విద్యార్థులు తమ నటనా కౌశలంతో శాస్త్రీయ అంశాలు, సామాజిక స్పృహ కలిగిన డ్రామా ప్రదర్శనలు చేయడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులు ఈ దిశలో విద్యార్థులను తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. విజేతలుగా నిలిచిన జన్కాపూర్ పాఠశాల విద్యార్థులను వారి గైడ్ టీచర్ రాజేశ్వ అభినందించారు. ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ డి. మహేశ్వర్, కార్యక్రమ సమన్వయకర్త రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు ధర్మపురి వెంకటేశ్వర్లు, నల్లగొండ రమేశ్, శ్రీలక్ష్మి, గైడ్ టీచర్ రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.



## బాక్సింగ్ జోనల్స్‌లో జాం సాంఘిక సంక్షేమ పాఠశాల విద్యార్థినికి బంగారు పతకం

సారంగాపూర్, అక్టోబర్ 10, ప్రభాతవార్త

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జోనల్ స్థాయి అండర్ 17 బాక్సింగ్ పోటీలు ఎన్టీఆర్ మినీ స్టేడియంలో బాల, బాలికలకు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో జాం సాంఘిక సంక్షేమ పాఠశాల చెందిన బి. కవిత బంగారు పతకం, వి. అక్షయ జె. సుహాసిని వెండి పతకాలను సాధించరని ఈ విద్యార్థినిలు తిరిగి రాష్ట్ర స్థాయిలో జరిగే బాక్సింగ్ పోటీలలో విజయం సాదించాలని కళాశాల ప్రిన్సిపల్ బి. సంగీత తెలిపారు. క్రీడారంగంలో విద్యార్థిలను నైపుణ్యం గుర్తించి తీర్చిదిద్దిన పిఈటి సుప్రియను అభినందించారు.



# ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలి

### - మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు

**నస్పూర్, అక్టోబర్ 10, ప్రభాతవార్త**

మండలంలోని ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా ప్రభుత్వ అధికారులు సత్వరమే చర్యలు తీసుకోవాలని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు అన్నారు. శుక్రవారం నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ భూములు కబ్జాకు గురి కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రజా ప్రతినిధులపై ఉందని, తాను ప్రజాసేవకే రాజకీయాల్లోకి వచ్చానని, తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పలు ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి స్థలాలు కేటాయించినట్లు, ప్రభుత్వ భూముల పరిరక్షణకు కృషి చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ భూముల కబ్జా విషయంలో కొంత మంది అధికారులు నిరక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, రాబోవు రోజుల్లో వారు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. మండలంలోని ప్రభుత్వ భూములను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని అన్నారు. నస్పూర్ శివారులోని సర్వే నెంబర్ 42లో ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయించిన భూములను అక్రమార్కుల చెర నుండి కాపాడి, ప్రభుత్వ భూముల చుట్టూ కంచె వేయాలని, కబ్జాకు ప్రయత్నించిన వారిపై, ప్రభుత్వ భూములు చదును చేసి అక్కడున్న




బోర్డులను తీసేసిన వారిని గుర్తించి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదే విషయమై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు అక్కూరి సుబ్బయ్య, నడిపెల్లి విజిత్ రావు, వంగ తిరుపతి, పవన్ కుమార్, బేర సత్యనారాయణ, కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, బండి రమేష్, మల్లెత్తుల రాజేంద్రపాణి, పానుగంటి సత్తయ్య, గరిసె రామస్వామి, వెంగళ కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.



## మొబైల్ ఫోన్‌లు అప్పగింత

**కెరమెరి, అక్టోబర్ 10, ప్రభాతవార్త**

మండలంలోని మోడీ, కరింజవాడ, కేస్లాగూడ గ్రామాలకు చెందిన ఆత్రం భుజంగరావు, బొక్కడే గోవిందరావు, కొమరం చిత్ర అనే వ్యక్తులు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌లను అప్పగించినట్లు ఎస్సై మధుకర్ తెలిపారు. సిఈఐఆర్ పోస్టర్ ద్వారా సేకరించి బాధితులకు అందజేశామన్నారు ఎవరైనా ఫోన్‌లు పోయినట్లయితే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు బాధితులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.



## గంజాయి సాగు చేయడం చట్టరీత్యా నేరం

### - తిర్యాని ఎస్సై వెంకటేష్

**తిర్యాని, అక్టోబర్ 10, ప్రభాతవార్త**

గంజాయి సాగు చేయడం చట్టరిత్యా నేరమని తిర్యాని ఎస్సై వెంకటేష్ పేర్కొన్నారు. శుక్రవారం తిర్యాని మండలంలో పోలీసుల తనిఖీల్లో భాగంగా చెలిమెల కొద్దుగూడ గ్రామశివారులో ఆత్రం పాపారావుకు చెందిన కంది పంట చేనులో 10 గంజాయి మొక్కలను గుర్తించినట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు. గంజాయి మొక్కలను సాగు చేస్తున్న ఆత్రం పాపారావు అనే నిందుతునిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై వెంకటేష్ మాట్లాడుతూ గంజాయి మొక్కలను సాగు చేసినా అక్రమ రవాణా చేసినా వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. గంజాయి సాగు, అక్రమ రవాణా నేరం మాత్రమే కాదని ఇది సమాజాన్ని నాశనం చేస్తుందన్నారు. గంజాయికి వ్యసనం కాకుండా యువత మంచిమార్గంలో పయనించి తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. ఎవరైనా గంజాయి సాగుచేస్తున్నట్లు గమనించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. యువత భవిష్యత్తు దృష్ట్యా గంజాయి వంటి మత్తు పదార్థాలను నిర్మూలించడంలో ప్రతి ఒక్కరు సహకరించాలని ఎస్సై కోరారు.

## క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది

**బెల్లంపల్లి, అక్టోబర్ 10, ప్రభాతవార్త**



క్రీడా పోటీల ద్వారా పలు ప్రాంతాల వ్యక్తుల మధ్య స్నేహభావం పెంపొందుతుందని బెల్లంపల్లి ఏరియా ఇంజినీర్ కృష్ణ మూర్తి అన్నారు. (డబ్ల్యూపిఎస్ అండ్ జిఏ) 92వ వార్షిక క్రీడా పోటీల్లో భాగంగా శుక్రవారం గోలేటిలోని సింగరేణి స్కూల్ మైదానంలో నియర్ బై బాల్ బ్యాడ్మింటన్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. బెల్లంపల్లి, మందమర్రి ఏరియాల ఉద్యోగ క్రీడాకారులు సమిష్టిగా పోటీల్లో పాల్గొని కోల్ ఇండియా స్థాయిలో రాణించాలని అన్నారు. గతంలో పతకాలు సాధించిన సీనియర్ క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టియుసి నాయకుడు ప్రకాష్ రావు, ఏఐటియుసి నాయకుడు జూపాక రాజేష్, సీనియర్ పర్సనల్ అధికారి డి. ప్రశాంత్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ అన్వేష్, జనరల్ క్యాప్టెన్ కిరణ్, వ్యాయామ ఉపాధ్యాయుడు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## గిన్నేధరిలో జిల్లా సమాఖ్య వాలీబాల్ ఎంపిక పోటీలు

**తిర్యాని, అక్టోబర్10, ప్రభాతవార్త**

తిర్యాని మండలంలోని గిన్నేధరిలోని బాలికల ఆశ్రమపాఠశాలలో శుక్రవారం జిల్లా క్రీడల సమాఖ్య ఆధ్వర్యంలో జోనల్ మీట్ క్రీడాపోటీలకు జిల్లాస్థాయి అండర్ 14,17 సంవత్సరాల బాలికలకు వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లా నుండి మొత్తం ఏడు పాఠశాలలకు చెందిన క్రీడాకారిణీలు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రిడాకారిణీలను జోనల్ మీట్ పోటీలకు ఎంపిక చేసినట్లు క్రీడా పోటీల నిర్వహణ కన్వీనర్ నైతం కృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాతూ బాలికలు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఆయన కోరారు. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు ఒత్తిడిని తట్టుకోవడానికి ఎంతో దోహద పడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జిఎఫ్ ప్రధాన కార్యదర్శి బోనగిరి వెంకట్, మాజి ప్రధాన కార్యదర్శి సాంబశివ రావు, నిర్వహణ కార్యదర్శి, డిఎస్ఓ మడావి శేఖు, ఎంపిక కమిటీ సభ్యులు బ్రహ్మం, పిడి శ్రీనివాస్, పిడి సుభాష్, జి వెంకటేశ్వర్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.




## డ్రై డే పాటిస్తే వ్యాధులు దూరం

### - ఎంపీఓ గోవర్ధన్

**దిలావర్‌పూర్, అక్టోబర్ 10, ప్రభాతవార్త**

ప్రజలు ప్రతి శుక్రవారం నిలువ ఉన్న నీటిని పారబోసి డ్రై డేను పాటిస్తే వ్యాధులకు దూరంగా ఉండవచ్చని ఎంపిఓ గోవర్ధన్ అన్నారు. శుక్రవారం దిలావర్‌పూర్ మండల కేంద్రంలో డ్రై డే ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు ప్రియాంక ఆధ్వర్యంలో సిబ్బంది ఇంటింటికి వెళ్లి నిల్వ ఉన్న నీటిని పారబోశారు. ఇంటి ఆవరణలో నీరు నిల్వ ఉండడం వల్ల లార్వాలు పెరిగి దోమలు ప్రబలుతాయి అన్నారు. దీనివల్ల వివిధ రకాల వ్యాధులు వస్తాయని పేర్కొన్నారు. అలాగే దోమలు పుట్టకుండా దోమ తెరలు వాడాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ రాజేశ్వర్, పంచాయతీ కార్యదర్శి సునీల్, ఆశాలు పంచాయతీ సిబ్బంది ఉన్నారు.





## ఘనంగా శ్యామ్ నాయక్ జన్మదిన వేడుకలు

**కెరమెరి, అక్టోబర్ 10, ప్రభాతవార్త**

మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ అజ్మీర శ్యాం నాయక్ పుట్టినరోజు వేడుకల్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మండల అధ్యక్షుడు ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఆత్రం కోసం రావు మాజీ సర్పంచ్ కావిడె తులసిరాం, రాథోడ్, శంకర్, తిరుపతి తదితరులు ఉన్నారు.

## ఆరవసారి మహాపాదయాత్రకు రమేష్ కన్నా గురుస్వామి

**రామకృష్ణాపూర్, అక్టోబర్ 10, ప్రభాతవార్త**



మహాసంకల్పంతో ప్రతి సంవత్సరం పాదయాత్ర నిర్వహిస్తున్న చంద్రగిరి రమేష్ కన్నా గురుస్వామి ఈసారి ఆరవ మహాపాదయాత్రకు సిద్ధమయ్యారు. శుక్రవారం పట్టణంలోని విజయ గణపతి దేవాలయం ప్రాంగణంలో మాలధారణ కార్యక్రమం ఘనంగా జరిగింది. కరీంనగర్‌కు చెందిన నాగరాజు గురుస్వామి ఆధ్వర్యంలో సుమారు 150 మంది భక్తులు మాలధారణలో పాల్గొన్నారు. ఈ నెల 12న ఆదివారం పాదయాత్ర ప్రారంభమై నవంబర్ 26న సన్నిధానం చేరుకోనుంది. అనంతరం అయ్యప్ప స్వామి అభిషేక కార్యక్రమంలో పాల్గొని యాత్రను ముగించనున్నారు.

## ఆర్థిక సహాయం అందించిన ఆటో యూనియన్

**చింతలమానేపల్లి, అక్టోబర్ 10, ప్రభాతవార్త**

మండలం బాబాసాగర్ గ్రామానికి చెందిన సోమన్కర్ కిషన్ కుమారుడు అజయ్ ఆటో డ్రైవర్ అనారోగ్యం వల్ల మరణించడంతో ఆర్థిక సహాయము అందించిన ఆటో యూనియన్. అనారోగ్యంతో చనిపోయిన అజయ్‌కు బాబాసాగర్, చింతల మానేపల్లి మండల ఆటో యూనియన్ నాయకుడు దస్తగిరి, బాబాసాగర్ అధ్యక్షుడు మీసాల తిరుపతి చేతుల మీదుగా 13,200 రూపాయల ఆర్థిక సహాయం అందించారు. మరణించిన అజయ్‌కు ఆటో యూనియన్ ఆర్థిక సహాయం అందజేసి మానవత్వం చాటుకోవడంతో వారిని పలువురు మెచ్చుకున్నారు.





# పోషణతో తల్లి, బిడ్డకు ఆరోగ్యం

**దిలావర్‌పూర్, అక్టోబర్ 10, ప్రభాతవార్త**

ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఏటా పోషణ మాసం ఏర్పాటు చేస్తుందని సిడిపిఓ నాగలక్ష్మి అన్నారు. ఇందులో భాగంగా దిలావర్పూర్ మండల కేంద్రంలో శుక్రవారం పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నారులు తీసుకోవాల్సిన పోషకాహారం గురించి వారికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. వివిధ కూరగాయలు, ఆకుకూరలు, పప్పు దినుసులు వంటి పదార్థాలను ప్రదర్శించి ఒక్కొక్క దానిపై వివరణ చేశారు. నేడు గర్భిణీలు పిల్లలు ఆహార లోపంతో ఎదుర్కొంటున్న సమస్యలపై పలువురు అధికారులు విషయాలను వెల్లడించారు. లోపాలను సరిదిద్దుకోవాలంటే పోషకాలు ఉన్న ఆహార పదార్థాలను స్వీకరించాలని పేర్కొన్నారు. దీనికోసమే ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేసి శాశ్వతంగా తల్లి బిడ్డకు లోపాలను సరి చేసేందుకు పోషకాలు గల ఆహార పదార్థాలను అందజేస్తుందని తెలిపారు. అనంతరం పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ గోవర్ధన్, అడిషనల్ సిడిపిఓ మానస, సూపర్వైజర్ ప్రసూన కుమారి, పంచాయతీ కార్యదర్శి సునీల్, అంగన్వాడీ టీచర్లు, గర్భిణీ స్త్రీలు, పిల్లలు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయిలో ఎంపికైన కేజీబివి విద్యార్థినిలు

**సారంగాపూర్, అక్టోబర్ 10, ప్రభాతవార్త**

విద్యార్థులకు చదువుతోపాటు కళలు ఎంతో ముఖ్యం వారిలోని ప్రతిభను వెలికి తీసేందుకు ప్రభుత్వం, రాష్ట్ర ఉన్నతాధికారులు ఏట కళోత్సవం నిర్వహిస్తారు. ఈ సంవత్సరం ఇటీవల జిల్లా స్థాయిలో పోటీలు జరిగాయి. 12 అంశాలలో వీటిని చేపట్టగా ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు విజేతలుగా నిలిచినారు. వీరు రాష్ట్రస్థాయిలో నిర్వహించే పోటీలలో పాల్గొనేందుకు సన్నద్ధమవుతున్నారు. జామ్ కేజీబీవీలో చదివే ఇంటర్, 9వ, 10వ తరగతి విద్యార్థినిలు మూడు అంశాలలో విజేతులుగా నిలిచారు. మొదటి విభాగం, బృంద పాటలలలో అక్షిత, మైథిలి, సంయుక్త, అక్షిత, ప్రణవి, రెండో విభాగం చిత్రలేఖనం 2డీలో మొదటి బహుమతి, పి. అభిజ్ఞ, మూడవ విభాగం నాటిక ప్రదర్శనలో జి. సుప్రియ, ప్రణవి, రిషిక, పవన శ్రీ, విజేతలుగా నిలిచి జ్ఞాపికలు, ధ్రువపత్రాలను దక్కించుకున్నారు. వీరు రాష్ట్రస్థాయిలో జరిగే ప్రదర్శనలకు సిద్ధమవుతున్నారు. అని విద్యతో పాటు విద్యార్థులకు ఏ రంగాలలో నైపుణ్యాం ఉందో గమనించి వివిధ రంగాలలో శిక్షణ ఇస్తూ వారిని జిల్లా స్థాయిలో బహుమతి పొంది రాష్ట్రస్థాయిలో ఎంపికైనందుకు అభినందించడం జరిగింది. మా పాఠశాలకు రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలిచి పేరు తీసుకురావాలనిఅని ప్రత్యేక అధికారిని అన్నపూర్ణ తెలిపారు. విజేతలను వీరితోపాటు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపినారు. రాష్ట్రస్థాయిలో తప్పకుండా మా పిల్లలు విజేతలుగా నిలవాలని కోరుకుంటున్నాం.




# 13 నుంచి ప్రజావాణి కొనసాగింపు

## - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్, అక్టోబర్ 10, ప్రభాతవార్త**

2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో నిలిపివేసిన ప్రజావాణి కార్యక్రమం ఈ నెల 13వ తేదీ నుండి యధావిధిగా కొనసాగించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం యధాతథంగా నిర్వహించడం జరుగుతుందని, అర్జీదారులు, ప్రజలు ఈ విషయాన్ని గమనించి తమ సమస్యల పరిష్కారం కొరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

# నెమలిని హతమార్చిన వేటగాళ్లు

## - వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలింపు

**బోథ్, అక్టోబర్ 10 ప్రభాతవార్త**



హంతకులు పథకం ప్రకారం జాతీయ పక్షి నెమలిని చంపారన్న బోథ్ అటవీ క్షేత్రాధికారి ప్రణయ్. వారి వివరాల ప్రకారం ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలం ఖండు రాంపూర్ గ్రామానికి చెందిన బద్యాల్ గంగా సింగ్ అనే వ్యక్తి బోథ్ మండలంలోని పొచ్చేర గ్రామంలో పాలేరు పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడని, గురువారం పొలం గట్టుపై పనిచేస్తుండగా 4 నెమలి గుడ్లను గమనించాడని, గుడ్లు పొదగడానికి నెమలి తప్పక వస్తుందని తెలుసుకున్న గంగా సింగ్ అదే గ్రామంలో వలస కూలీలుగా పనిచేస్తున్న పిప్రే దత్తు, టార్పే బాలాజీల సహాయంతో ముగ్గురు కలిసి గురువారం రాత్రి 9 గంటల సమయంలో గుడ్లపై పొదిగి ఉన్న నెమలిని టార్చ్ లైట్ సహాయంతో కర్రలతో కొట్టి చంపడం జరిగిందని తెలిపారు. చనిపోయిన నెమలిని సంచిలో వేసుకొని ద్విచక్ర వాహనంపై వెళుతుండగా రాత్రి పెట్రోలింగ్ చేస్తున్న అటవీశాఖ అధికారులకు అనుమానం వచ్చి తనిఖీ చేయగా చనిపోయిన జాతీయ పక్షిని దాని గుడ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే నిందితులపై వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. అటవీశాఖ అధికారులు వారి సిబ్బంది పాల్గొన్నారు.



# 13న ఉచిత హోమియోపతి వైద్య శిబిరం

## - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్, అక్టోబర్ 10, ప్రభాతవార్త**

జాతీయ ఆయుష్ పథకంలో భాగంగా ఈ నెల 13వ తేదీన ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న హోమియోపతి వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో ఆయుష్ శాఖ, వైద్య శిబిరం ఇంచార్జ్ డా. సిహెచ్. స్పందన శిబిరానికి సంబంధించిన కరపత్రాన్ని జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ ఆయుష్ పథకం క్రింద ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత హోమియోపతి వైద్య శిబిరం, ఆరోగ్య అవగాహన సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

